క్లుప్తంగా

బాల్య వివాహాలు సామాజిక దురాచారం



బిక్కవోలులో కౌమార బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి

బిక్కవోలు: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద వేసవి సెలవుల్లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా ఐసీడీఎస్ బిక్కవోలు సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ కిశోరి బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఒకరికొకరు పరిచయం చేసుకోవడంతో పాటు లక్ష్యాలను నిర్ధారించుకోవడం తదితర అంశాలు వివరించారు. బాల్య వివాహాలు సామాజిక దురాచారమని వాటి వలన కలిగే నష్టాలను తెలియజేశారు. అంగన్‌వాడీ పరిధిలో ఉన్న కిశోరి బాలికలను గుర్తించి వారికి ఈ విషయాలు తెలియజేయాలని అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ ఆలయం వద్ద చలివేంద్రం



గాడాల గంగాలమ్మ ఆలయం వద్ద ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రం

కోరుకొండ: గాడాల గంగాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం అటుగా వెళ్తున్న ప్రయాణికుల దాహార్తిని తీరుస్తోంది. ఎయిర్ పోర్టు రోడ్డు గుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులు, స్థానికులు, ఉపాధి కూలీలు ఇక్కడి నీటిని తాగుతున్నారు. ఆలయ ధర్మకర్త కొండపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం వేళల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



గణపతి పూజ చేస్తున్న నిర్వాహకులు

కోరుకొండ: దోసకాయలపల్లిలో శ్రీపర్వతవర్ధిని సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం గణపతి పూజ నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం కార్యక్రమంలో భాగంగా శనివారం శంకుస్థాపన మార్ని సుధాకర్, జానకీదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఆలయాన్ని నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయాన్ని మార్ని సుబ్బారాయుడు, సరసయమ్మ దంపతులు నిర్మించారు. నాటి నుంచి స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో శుక్రవారం గణపతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకస్వామి శర్మ, భక్తులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ధర్మకర్త మార్ని సుధాకర్ కోరారు.

ఐఎస్‌టీఎస్‌కి ఉత్తమ మహిళా కళాశాల అవార్డు



న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్ భూషన్‌చౌదరి నుంచి అవార్డును అందుకుంటున్న ఐఎస్‌టీఎస్ చైర్మన్ ఉపేంద్రరెడ్డి

రాజానగరం: తూర్పుగానుగూడెంలో ఉన్న ఐఎస్‌టీఎస్‌కు ఉత్తమ మహిళా కళాశాల అవార్డును లభించింది. ఆసియా టుడే మీడియా వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2025 సందర్భంగా న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్ర జలశక్తి మంత్రి రాజ్ భూషన్‌చౌదరి చేతుల మీదుగా కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి అందుకున్నారు. విద్యాబోధనతోపాటు ప్లేస్మెంట్స్, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని లభించిన ఈ అవార్డు అందించారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా అవార్డుకు ఎంపికైనట్టు చైర్మన్ శుక్రవారం తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఈనెల 12 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు మే 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం శుక్రవారం తెలిపారు. 3వ తేదీ వరకు ఇచ్చిన పరీక్ష ఫీజు గడువును 12 వరకూ పొడిగించారని, ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఇచ్చిన గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

‘కిశోరి వికాసం’.. బాలికల భవితకు పునాది

- జూన్ 10 వరకు అమలు
- 12 అంశాలపై అవగాహన



కిశోర బాలికలతో అవగాహన సదస్సు

రాజానగరం: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుంది. ఆంధ్రప్రదేశ్ మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిశోరి బాలిక వికాసం కార్యక్రమం ప్రారంభమైంది. ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికార దిశగా అడుగుల వేసే క్రమంలో బాలికలకు చేయూత నిచ్చేందుకు ఈ కార్యక్రమం రూపకల్పన ముఖ్య ఉద్దేశ్యం. బాలికల జీవితంలో యవ్వనంలోకి వచ్చే దశ (కిషోర్ బాలిక) ఎంతో కీలకమైనది. సమాజంలోని రుగ్మతలు, మంచి చెడుల గురించి తెలిసీ, తెలియని ఈ దశలోనే బాలికలు మోసాలకు గురవుతుంటారు. ముఖ్యంగా ప్రేమ పేరుతో వంచనకు గురై, కామాంధుల చెరలో చిక్కి జీవితాలను నాశనం చేసుకుంటున్నవారు ఎందరో ఉన్నారు. అటువంటి సమయంలో కౌమార బాలికలను చైతన్యపరచి, సమాజం పట్ల వారికి ఒక అవగాహనను తీసుకురావడం ఎంతో ముఖ్యం. ప్రతి ఇంటా ఈ పనిని తల్లిదండ్రులు ముఖ్యంగా మాతృమూర్తి చేయవలసి ఉంటుంది. ఆ తరువాత పాఠాలు బోధించే ఉపాధ్యాయులపై ఆ బాధ్యత ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో చదువుకుంటున్న, చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్న 11 నుంచి 18 ఏళ్ల వయస్సు బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కలిగించి, వారిని అప్రమత్తం చేయడంలో భాగంగా ప్రభుత్వం 'కిషోరి వికాసం' పేరుతో జూన్ 10 వరకు నిర్వహించే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు.

వేసవి సెలవులు ఉపయోగపడేలా..

వేసవి సెలవులను ఉపయోగించుకుంటూ కిషోరి వికాసం కార్యక్రమాన్ని రూపొందించారు. మే 2 నుంచి జూన్ 10 వరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత తదితర 12 అంశాలపై బాలికలకు అవగాహన కలిగిస్తారు. 11 నుంచి 14 సంవత్సరాల వయస్సు బాలికలు, 15 నుంచి 18 సంవత్సరాల మయస్సు డ్రాపౌట్స్‌ను గుర్తించి వారికి వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా చైతన్యపరుస్తారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని కూడా ఈ కార్యక్రమం అమలులో భాగస్వాములను చేశారు. మహిళా పోలీసు (కన్వీనర్), అంగన్‌వాడీ కార్యకర్తతోపాటు వైద్యంలో ఎంపీహెచ్ఏ, ఏఎన్ఎంలకు కీలక బాధ్యతలను అప్పగించారు.

బాల్యవివాహాలను నిరోధించేందుకు

నియోజకవర్గంలో బాల్యవివాహాలను నిరోధించుటలో కూడా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా బాల్యవివాహాల విషయంలో తరచూ వార్తల్లో నిలుస్తున్న రాజానగరం మండలం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, జి.యర్రంపాలెం, కొత్తతుంగపాడు, పాత తుంగపాడులో బాలికలు, వారి తల్లిదండ్రులకు బాల్యవివాహాల వలన ఎదురయ్యే సమస్యలపై అవగాహన కలిగించనున్నారు.

12,274 మంది కౌమార బాలికలు

నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 12,274 మంది కౌమార బాలికలు ఉన్నట్టుగా గుర్తించారు. వీరిలో 11 నుంచి 14 ఏళ్ల వయస్సు బాలికలు 6,785, 15 నుంచి 18 ఏళ్ల మయస్సు డ్రాపౌట్సు 5,489 ఉన్నారు.

కార్యక్రమం అమలు ఇలా..

- మే 2న బాలికల సమష్టి పరిచయం
- మే 6న రుతుక్రమ, పరిశుభ్రత, నిర్వహణ, లైంగిక విద్య
- మే 9న బాల్యవివాహం, పునరుత్పత్తి, ఆరోగ్యం
- మే 13న బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం
- మే 20న లింగ అసమానత
- మే 23న విద్య, కెరీర్, మార్గదర్శకత్వం, నైపుణ్యాల ప్రాముఖ్యత
- మే 27న సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు
- మే 30న ఆర్థిక నిర్వహణ
- జూన్ 3న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత
- జూన్ 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత
- జూన్ 10న బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

కౌమార బాలికలను చైతన్యపర్చడం కోసమే..



సమాజంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకుని, చైతన్యవంతులుగా కౌమార బాలికలను తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం 'కిషోరి వికాసం' పేరిట వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. దీని ద్వారా బాల్యవివాహానాలను నిరోధించడంతోపాటు బాలికలకు ఉన్నత విద్య ఆవశ్యకతను తెలియజేసేందుకు అవకాశం ఉంటుంది. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 11-14 వయస్సులో ఉన్న బాలికలు 6,832 మంది, 15 - 18 వయస్సులో ఉన్న డ్రాపవుట్స్ 5,633 మంది ఉన్నారు.

– కె. నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, రాజానగరం

వ్యవసాయ రంగంలో రోబోల వినియోగం



జీజీయూలో ఫార్మా రోబో క్షేత్ర ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

రాజానగరం: వ్యవసాయ రంగంలో రోబోల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతోపాటు సాగు ఖర్చులను తగ్గించి, రైతుల జీవనోపాధిని మెరుగుపరచవచ్చని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. జీజీయూలో శుక్రవారం నిర్వహించిన ఫార్మా రోబో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రస్తుతం వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినయోగం పెరుగుతోందన్నారు. బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఆధునిక ఆలోచనలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు చేకూర్చేలా పరిశోధనలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆ స్ఫూర్తిని తీసుకురావడం కోసమే తరచూ ఇటువంటి కార్యక్రమాలకు జీజీయూ నిర్వహిస్తోందన్నారు. జీజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, ఫార్మా రోబో ఎండీ వజ్రాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- దోపిడీ, దౌర్జన్యాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా



బొల్లెద్దుపాలెంలో పార్టీ శ్రేణులతో కలసి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా

కోరుకొండ: దోపిడీ, దౌర్జన్యాలను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని, ఇసుక, మట్టి, ప్రకృతి వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం, గరగలం పాలెంలో నా కార్యకర్తలు–నా కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయడంతో పాటు, ప్రజాసంపదను కాపాడటానికి అవిశ్రాంతంగా పోరాడుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీకి బలమైన, నిజాయతీగల క్యాడర్ ఉందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా, కోటీశ్వరుల ఆస్తులు పెరిగే విధంగా కూటమిపాలన సాగుతోందని దుయ్యబట్టారు.

కూటమి పాలనలో రైతుల అవస్థ

మే నెల ప్రారంభమైనప్పటికీ రైతులకు భరోసా కల్పించే విధంగా సహకారాన్నివ్వడం లేదన్నారు. నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇక్కట్లకు గురిచేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి, జీడిమామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులు, కొత్త తరం నాయకులను సమన్వయం చేయడంతోపాటు, వారిలో ఐక్యత పెంచడానికి నా కార్యకర్తలు–నా కుటుంబం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆయన ఈ సందర్భంగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీనాయకులు నక్కా రాంబాబు, బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమెళ్ల బుజ్జియ్య, గరగలంపాలెం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, నాయకులు బోడపాటి కొండబాబు, డేగల బాబులు, కోలా వీరబాబు పాల్గొన్నారు.

జగద్గురు ఆది శంకరాచార్యులు ఆదర్శనీయుడు



అనపర్తిలో ఆదిశంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజ చేస్తున్న సురేష్ వర్మ తదితరులు

పెదపూడి: జన్మనిచ్చిన తల్లిదండ్రులను సేవించి, వారి పట్ల విధేయతగా ఉండటం ప్రతి ఒక్కరి ధర్మమని, మానవులు ధర్మాలను, కర్తవ్యాలను విడనాడరాదని ప్రబోధించిన ఆదర్శనీయుడు అద్వైత మత స్థాపనాచార్యులు జగద్గురు ఆది శంకరాచార్యులు అని బాలరాజేశ్వరి పీఠం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్ శర్మ అన్నారు. అనపర్తిలో ఆదిశంకరాచార్యులు జయంతిని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆదిశంకరుల చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ శర్మ మాట్లాడుతూ వేద ప్రమాణికమైన సనాతన ధర్మ వైభవాన్ని పునరుద్ధరించడానికి ఆది శంకరాచార్యులు జన్మించారన్నారు. వారి బోధనలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన బీహెచ్ఎల్ నారాయణరావు, విజయలక్ష్మి దంపతులు, రెడ్డి రామమోహనరావు, సర్వ లక్ష్మి దంపతులు, రెడ్డి సతీష్ నాగదేవర బాలాజీ శర్మ పాల్గొన్నారు.

అక్కినేని అందరికీ ఆదర్శప్రాయుడు



పాత దొడ్డిగుంటలో అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

రంగంపేట: ప్రముఖ చలన చిత్ర నటుడు, దివంగత అక్కినేని నాగేశ్వరరావు నేటి యువ నటులకు ఆదర్శప్రాయుడని అక్కినేని కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడబాల మరిడియ్యకాపు అన్నారు. మండల పరిధిలోని పాత దొడ్డిగుంట గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అక్కినేని నటించిన జై జవాన్ చలన చిత్రం 55వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రైతు సంఘ నాయకుడు తోట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశభక్తిని చాటే జై జవాన్ చిత్రం నేటి యువతరానికి స్ఫూర్తినిస్తుందన్నారు. అంతకు ముందు అక్కినేని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అభిమాన సంఘ సభ్యులు వెలమర్తి రామకృష్ణ, త్రిమూర్తులు, పేపకాయల వెంకన్న, నర్ల లక్ష్మీనారాయణ, మాగపాటి మునసుబు తదితరులు పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు అడబాల మరిడియ్యకాపును వారంతా ఘనంగా సత్కరించారు.

పంటల గిట్టుబాటు ధర చట్టం కోసం పోరాడుదాం



సింగంపల్లిలో ఎర్ర జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యమ నాయకులు

రంగంపేట: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక చట్టం చేయాలని దాని కోసం అందరం కలసి పోరాడదామని ఏపీ రైతు కూలీ సంఘం (ఏపీ ఆర్‌సీఎస్) జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామం సీపీరెడ్డి నగర్ కాలనీలో ఏపీ ఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మే డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏపీ ఆర్‌సీఎస్ జెండాను సంఘం మండల నాయకులు చెక్క సత్తిబాబు ఆవిష్కరించి, మే డే అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఎర్ర జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం రైతన్నలకు కేంద్రం ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని డిమాండ్ చేసారు. సింగంపల్లి సీపీ రెడ్డి నగర్ వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేసారు. ఈనెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, ఏపీ ఆర్‌సీఎస్ నాయకులు నవీన్, రాయుడు కన్నబాబు, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు రెడ్డి దుర్గాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు

ధవళేశ్వరం: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలు ధవళేశ్వరంలో శనివారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ గ్రంధి వెంకటరామజగన్నాథం, అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీనివాసరావు, కార్యదర్శి అప్పన వెంకట రామమూర్తి, జాయింట్ సెక్రటరీ శీరం దుర్గాప్రసాద్, ట్రెజరర్ యలమర్తి రామచంద్రమూర్తి, జాయింట్ ట్రెజరర్ కందుల శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ చోడవరపు లక్ష్మీనారాయణరావు తెలిపారు. అమ్మవారి జయంతోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. 4వ తేదీన చండీ హోమం, 7న గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు.

పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ధర్మరాజు

ధవళేశ్వరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ ఎస్‌జీఆర్ఈఏ) ధవళేశ్వరం యూనిట్ నూతన అధ్యక్షుడిగా యర్రమోతు ధర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా యర్రమోతు ధర్మరాజు ప్రధాన కార్యదర్శిగా దువ్వూరి కామేశ్వర శర్మ, కోశాధికారిగా ఉర్రింకల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా దాసరి సాయిబాబు, టి.కేశవరావు, ఉపాధ్యక్షులుగా శ్రీరంగం వెంకటేశ్వర్లు, కె రామారావు, కొండా సూర్యనారాయణ, బుగ్గా సత్య సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్ విజయ మోహన్, సంయుక్త కార్యదర్శిగా అంజూరి సూర్యారావు, కొంజర్ల వెంకటరత్నం, సీహెచ్ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అరప సత్యనారాయణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారన్నారు.

మూగజీవాలను ఆదరించండి



కుండీలు పంపిణీ చేస్తున్న పంతం కొండలరావు

రాజమహేంద్రవరం సిటీ: వేసవికాలంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నామన వాసు, లలితా నగర్ ఫ్రెండ్స్ సర్కిల్ సహకారంతో నామన ధనరాజు జ్ఞాపకార్థం ఏటా వేసవిలో మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు స్థానికులకు నీటి కుండీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ తొలి విడతలో 300 కుండీలను పంపిణీ చేశామన్నారు. నాటి నుంచి ఏటా నీటి కుండీల పంపిణీని నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టు పంపిణీ చేసిన నీటి కుండీలను కొంతమంది స్థానికులు సక్రమంగా వినియోగించడం లేదన్న విషయాన్ని గుర్తించామన్నారు. నీటి కుండీల్లో నీళ్లు పోసి, మూగ జీవాలకు అందుబాటులో ఉంచాలన్నారు. తమ ట్రస్టును సంప్రదిస్తే ఉచితంగా నీటి కుండీలను అందజేస్తామని కొండలరావు తెలిపారు. వీధి కుక్కలను నియంత్రించేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందని, దీనికి స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు, ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడంపై లలితానగర్ వాసులకు అవగాహన కలిగించేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలితానగర్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు నామన వాసు, రాజమండ్రి జైన్ సేవాసమితి ప్రతినిధి రాజ్ కఠారియా, నండూరి సుబ్బారావు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె



కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్‌వోల నిరవధిక సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి బొమ్మూరు సెంటర్ నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అధిక సంఖ్యలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

యువకుడిపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ: ఎలాంటి చెడు వ్యసనాలు లేని అమాయక యువకుడిపై తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్య తీసుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్ చేశారు. క్వారీ ప్రాంతంలోని 49వ వార్డు సుబ్బారావు నగర్‌లో ఇరుగుపొరుగు మధ్య ఇంటి వివాదంలో అమాయక యువకుడి భవిష్యత్తును దెబ్బతీసేందుకు ఒక పథకం ప్రకారం కొందరు జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని, దీంతో త్రీ టౌన్ పోలీసులు విచారణకు రావడంతో యువకుడి తల్లి అభ్యర్థన మేరకు తాను ఆ కుటుంబానికి అండగా నిలిచినట్లు కొండబాబు చెప్పారు. శుక్రవారం ఆయన స్థానికులను కలిసి గుత్తుల భానుప్రసాద్ ప్రవర్తనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావునగర్‌లో నివసిస్తున్న గుత్తుల లక్ష్మి కుటుంబానికి పక్క ఇంటిలో నివసిస్తున్న షేక్ శ్రీను రెండో భార్య షేక్ సాయితో కొన్నేళ్లుగా సివిల్ తగాదా కోర్టులో నడుస్తోంది. లక్ష్మిని ఆ ఇంటి నుంచి వెళ్లగొట్టేందుకు ఆమె కుమారుడు భానుప్రసాద్ వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా మద్యం తాగి తమ ఇంటిలోకి ఖాళీ సీసాలు విసురుతున్నాడంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని కొండబాబు తెలిపారు. అమాయక యువకుడి కుటుంబానికి అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా చూస్తామని కొండబాబు హామీ ఇచ్చారు.

• సన్‌స్ట్రోక్



నిత్యం రద్దీగా ఉండే రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణికులు లేక వెలవెలబోయింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండ వేడిమి, ఉక్కబోత తాళలేక ప్రయాణికులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో మధ్యాహ్నం బస్సులు, బస్టాండ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

– 'సాక్షి' ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం